# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 23-08-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- రానున్న 5 సంవత్సరాల్లో రాష్ట్రంలోని అన్నీ గ్రామాల్లో సిమెంట్ రోడ్లు నిర్మిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు.
- రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి అన్ని చర్యలు చేపడుతున్నామని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు.
- రానున్న ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఆధునిక సాంకేతికను వినియోగించి రైతులకు ఇబ్బంది లేకుండా చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.
- రాష్ట్రంలోని గ్రామాలను స్వర్ణ గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈరోజు అన్ని పంచాయితీలలో గ్రామ సభలు నిర్వహించారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

====================

రానున్న 5 సంవత్సరాల్లో అన్నీ గ్రామాల్లో 17 వేల 500 కిలో మీటర్ల మేర సిమెంట్ రోడ్లు నిర్మిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ రోజు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వానపల్లి గ్రామసభలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉపాధిహామీ పథకం నిధులతో 40, 60 నిష్పత్తితో గ్రామాలను అభివృద్ధి చేసుకునే దిశగా అడుగులు వేయడం జరుగుతోందని తెలిపారు. రాష్ట్రంలో ఉపాధిహామీ పథకం నిధులతో 9 కోట్ల పనిదినాలు, 54 లక్షల కుటుంబాలకు ఉపాధి హామీ, తద్వారా 4 వేల 500 కోట్ల రూపాయలతో పనులు జరగనున్నాయని వెల్లడించారు. 10 వేల కిలో మీటర్ల మేర డ్రైనేజీ నిర్మాణం చేపట్టడంతో పాటు 2 వేల 500 కిలో మీటర్ల బి.టి. రహదారుల నిర్మాణం చేయనున్నామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

====================

రానున్న ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లలో ఆధునిక సాంకేతికను వినియోగించి రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు నిర్వహిస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గుంటూరు జిల్లా కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ... రైతులకు యూరియా సరఫరాలో ఏ విధమైన అక్రమాలు లేకుండా అందచేసే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేసారు. కొల్లిపర మండలంలో 29 లక్షల రూపాయలతో మౌలిక వసతుల రూపకల్పన పనులు రానున్న రెండు మూడు నెలలలో మొదలుపెడతామని మంత్రి వెల్లడించారు. గ్రామ ప్రజలకు అధికారం ఇస్తేనే గ్రామాభివృద్ధి, తద్వారా దేశాభివృద్ధి సాధ్యమని.. అందుకే ఒకే రోజున 13 వేల 362 గ్రామసభలను నిర్వహిస్తున్నామని మంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 25 సెకన్లు)

====================

ప్రతి గ్రామ పంచాయతీలో ప్రజల సమస్యలు పరిష్కరించి, స్వర్ణ గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈరోజు రాష్ట్రంలోని 13 వేల 326 పంచాయితీలలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ గ్రామ సభల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అందులో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం లంకలకోడేరు గ్రామంలో ఉపాధి హామీ పథకం గ్రామసభలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. ప్రజా నిర్ణయాలకు గ్రామసభలతో శ్రీకారం చుట్టి వారికి జవాబుదారీగా ఉండాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. స్థానిక పరిపాలన సక్రమంగా జరగాలంటే.. గ్రామ ప్రజల సమిష్టి నిర్ణయం అవసరమనే ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం నిర్ణయం మేరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నామని నిమ్మల రామానాయుడు తెలిపారు. అలాగే గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ. జనార్ధన్ రెడ్డి అన్నారు.

====================

అనకాపల్లి జిల్లా జవహర్ లాల్ నెహ్రూ ఫార్మా సిటీలోని సినర్జిన్ యాక్టివ్ ఇన్ గ్రేడియంట్స్ సంస్థలో ఈరోజు జరిగిన ప్రమాదంలో గాయపడి ఇండస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పరామర్శించారు. బాధితులకు అందుతున్న వైద్యంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించేందకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను హోం మంత్రి ఆదేశించారు. ప్రమాదంలో నలుగురు కార్మికులకు తీవ్ర గాయాలు కాగా ఇండస్ ఆసుపత్రిలో ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. గాయపడిన నలుగురులో ముగ్గురు కార్మికులు జార్ఖండ్ వాసులు, ఒకరు విజయనగరం జిల్లా వాసిగా అధికారులు గుర్తించారు. విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, అనకాపల్లి జిల్లా సంయుక్త కలెక్టర్ ఎమ్.జాహ్నవిలు మంత్రి వెంట ఉన్నారు.

విరామం

====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 113వ సంచిక ఈ ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. ఈ కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్ నెట్ వర్క్లు, ఏఐఆర్ న్యూస్ వెబ్ సైట్ ద్వారా న్యూస్ ఆన్ ఎయిర్ మొబైల్ యాప్‌లో ప్రసారం కానుంది. “మన్ కీ బాత్” హిందీ ప్రసంగం ప్రసారమైన వెంటనే అన్ని ఆకాశవాణి ప్రాంతీయ భాషల్లో దీని అనువాదం ప్రసారం అవుతుంది.

====================

పార్వతీపురంలో నిర్మిస్తున్న వైద్య కళాశాలను త్వరలో పూర్తి చేస్తామని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. పార్వతిపురం మన్యం జిల్లా పర్యటనలో భాగంగా ఈరోజు సీతానగరం మండలం జోగంపేట కస్తూరి భాగాంధీ బాలికల విద్యాలయాన్ని మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కేజీబీవీలో నెలకొన్న పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు.  తక్షణమే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు జూనియర్ డాక్టర్లు సమ్మె విరమించడం సంతోషకరమని సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. వైద్యుల రక్షణపై సుప్రీం కోర్టు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి హామీ లభించిందని తెలిపారు. పని ప్రదేశాల్లో వైద్యుల భద్రతకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. వైద్యుల డిమాండ్లు పరిశీలించి చిత్తశుద్ధితో అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలోనూ వైద్యుల రక్షణకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృత నిశ్చయంతో ఉన్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

====================

రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి అన్ని చర్యలు చేపడుతున్నామని ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ అన్నారు. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం మైసూరు వారి పల్లెలో 'స్వర్ణ గ్రామ పంచాయతీ' పేరిట ఈరోజు నిర్వహించిన గ్రామ సభలో ఉపముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి ఏం చేయాలన్న అంశంలో గ్రామసభ చాలా ముఖ్యమని అన్నారు. రాష్ట్రంలోని 13 వేల 326 పంచాయతీలను అభివృద్ధి చేసేందుకు నిరంతరం పని చేస్తామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనుభవం ఆంధ్రప్రదేశ్‌కు అవసరమని గతంలో చాలా సార్లు చెప్పానని గుర్తు చేశారు. నాకంటే బాగా ఆలోచించ గలిగేవాళ్ల వెంట నడిచేందుకు నేనేమీ సంకోచించనని అన్నారు. ఉపాధి అవకాశాలు పెంచెందుకు వలసలను అరికట్టేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ వర్సిటీ తీసుకొస్తామని పవన్ కళ్యాణ్ వెల్లడించారు.

====================

పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. బాపట్ల జిల్లా, రేపల్లె నియోజకవర్గంలో మంత్రి ఈరోజు పర్యటించారు. నగరం మండలం దూళిపూడిలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు 6 కోట్ల రూపాయల వ్యయంతో 30 పడకల వైద్యశాలకు మంత్రి అనగాని సత్యప్రసాద్, బాపట్ల ఎంపీ కృష్ణ ప్రసాద్ తో కలసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రెవెన్యూ శాఖ మంత్రి మాట్లాడుతూ... పేద ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాల కల్పనలో భాగంగా ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద పీట వేస్తుందన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని అన్నారు.

====================

యువత శాస్త్ర సాంకేతికతను అందిపుచ్చుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని తిరుపతి జిల్లా గూడూరు శాసనసభ్యులు సునీల్ కుమార్ ఆకాంక్షించారు. జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, క్షేత్ర కార్యాలయం, నెల్లూరు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతరిక్ష విశేషాల ఫోటో ఎగ్జిబిషన్ ను ఆయన ఈరోజు  ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా అంతరిక్ష దినోత్సవం జరుగుతున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్ లోని గూడూరును భారత ప్రభుత్వం కార్యక్రమ నిర్వహణ కోసం ఎంపిక చేయటం ఆనందదాయకమని సునీల్ కుమార్ తెలిపారు.

====================

అల్లూరి సీతారామరాజు జిల్లాలో రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై ఈరోజు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ ఏ. ఎస్. దినేష్ కుమార్ ఆధ్వర్యంలో  పోలీసు సూపరింటెండెంట్  అమిత్ బర్దర్, ఐ.టీ.డి.ఏ.  ప్రాజెక్టు అధికారి అభిషేక్, జిల్లా ఉన్నతాధికారులు, వివిధ కళాశాలల విద్యార్థిని, విద్యార్థులు పాడేరు పట్టణంలో నిర్వహించిన ఈ ర్యాలీలో

పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ద్విచక్ర వాహన దారులు ఎట్టి పరిస్థితుల్లోనూ శిరస్త్రాణం లేకుండా వాహనం నడుప రాదని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని అన్నారు.

=====================

=====================